# కీలెరిగిన వాత

కృష్ణవేణి వీధిలోనుంచీ, ఆమెతల్లి రాధమ్మ వంటింటి వసారాలో నుంచీ వొక్కమాటే దక్షిణపు వసారాలో ప్రవేశించారు,

"సమయానికి వచ్చావుతల్లీ" అంది రాధమ్మ; కాని దానికి బదులు చెప్పకుండా వూచలాగ వెళ్ళి వొక కుర్చీమీద కూచుని, మేజామీదికి మోచేతుల మీద వాలి, కళ్ళు మూసుకున్నుంది, కృష్ణవేణి.

ఆమె వాలకం చూసి కంగారుపడిపోయింది రాధమ్మ.

గభీమని టీపాయి మేజామీద వుంచేసి "యేమి తల్లీ" అంటూ మరో కుర్చీ దగ్గిరికి లాక్కుని కూచుని "ఏం అలా అయిపోయావేమమ్మా?" అనడిగింది, వీపు నిమురుతూ.

"సంబంధం తిరిగిపోయింది"

"అయ్యో"

"................"

"ఏం?"

"కట్నం కావాలిట వాడికి"

"ఇదివరకీమాట రాలేదుగదమ్మా?.... అయినా యెంతట?"

"వాడి తలకాయంతట. ఎంతయితే మాత్రం, యివ్వడానికివతల సిద్ధంగా కూచున్నారా?"

రాధమ్మ, మరి, మాట్టాడలేక పక్కనే కూచుని ఉత్తరాలు రాసుకుంటున్న యాజులుకేసి చూసింది.

ఇరవైయేళ్ళు నిండిన కూతురికి కుదరక్కదరక కుదిరిన సంబంధం తిరిగిపోయిందనేటప్పటికి కామె తల తిరిగిపోయింది. మనస్సున్నూ చెదిరి పోయింది.

అప్పటికి రాతముగించి వచ్చి కూతురికి దగ్గిరగా మరో కుర్చీమీద కూచుని "అతనే అడిగాడా తల్లీ?" అనడిగాడు, ప్రేమగా, యాజులు.

"అవునండీ"

"................"

"తన తల్లికీ అక్కకీ లాంఛనాలు కూడా—"

"ఎందుకు వచ్చిన చదువు?"

యాజు లిలా అనడం చూసి కొయ్యయిపోయింది రాధమ్మ.

దీంతో ఆ సంబంధం విషయమై పూర్తిగా నిరాశ చేసుకుందామె

ఒక అన్నా, వొక అక్కానూ ఆ పిల్లవాడికి. తండ్రితో పాటు వకీలు చక్కనివాడూ చురుకైనవాడూ కూడాను. దూరపు చుట్టరికం కూడా వుంది. తమకి. రెండు మేడలున్నాయి వాళ్ళకి. భూవసతి కూడా ఎక్కువగానే వుంది. పదివేలయినా యివ్వతగ్గ సంబంధం. తన ఆస్తీ, తమ ఆస్తీ కలిస్తే పిల్ల జమీందారే అయిపోతాడు.

మళ్ళీ అలాంటి సంబంధం రావడం మాటలుకాదు.

ఉసూరుమన్నట్టయిపోయిందామె.

యాజులు రాధమ్మ యింగితం కనిపెట్టాడు; కాని ఆమెమాటలెక్కచెయ్య తలుచుకోలేదు.

"నువ్వేమన్నావు తల్లీ?"

"నీమొగం చూడగూడ, దవతలికి పొమ్మన్నానండీ"

"మంచిపనిచేశావు"

పులుకూ పులుకూ చూసింది రాధమ్మ, తిరగబడి.

అది గుర్తించి "మరి నువ్వేమంటావూ?" అనడిగింది తల్లిని కృష్ణవేణి.

"ఏమనడానికేమి వుందీ? కాలం యిలా మండిపోతోంది. మా అమ్మాయిని మీ అబ్బాయికిస్తామని చెప్పాటప్పటికేమిస్తావని—"

"ఆ అబ్బిగాడే అడిగితే ఏమిస్తావని?"

కృష్ణవేణి చాలా దురుసుగా అడిగిందీమాట.

"నిజం చెప్పు. అతగాడు కట్నం కావాలంటే నువ్వేమన్నావు?"

"నాన్నారితో చెప్పిండే, నీ మొగం చూడగూడదు - పో—"

"నిజంగా ఈమాటే అన్నావా?"

"ఏమి అనకా? వెంటనే వాడవతలికి జారుకున్నాడు కనక సరిపోయింది, లేకపోతే ఏమి జరిగివుండునో."

ఒక మాటకంటే వొకమాట రాధమ్మని దిగతీశాయి.

"ఆడదానికంత దురుసుతనం పనికిరాదమ్మా"

"విన్నారా?" అన్నట్టు కృష్ణవేణి తనకేసి చూడగా "ఏంచేతా?" అనడిగాడు యాజులామెని.

"ఏమి చేసినా మొగవాడికి చెల్లుతుంది"

"ఆడది చెల్లనిస్తేను........ అంతేనా?"

"ఎఫ్.ఏ.బి.ఏ.లు చదివితే మాత్రం ఆడపిల్లలంతా యిలా అంటున్నారా?"

"ఎఫ్.ఏ.బి.ఏ.లు చదవడంకాదు ప్రధానం, సంస్కారం అబ్బాలి. అది లేసప్పుడాడదేమిటి, మొగవాడేమిటి, చదువుకున్న మూర్ఖులే అవుతారు."

"అమ్మాయి మాట చెప్పండి ముందు"

"గొప్ప ఆశయాలున్న పిల్ల—"

మాట సగంలో అందుకుని "మీరుండండి నాన్నారూ" అంటూ తల్లికేసి తిరిగి "అమ్మాయి కేమిలోటు వచ్చిందమ్మా యిప్పుడు?" అనడిగింది కృష్ణవేణి.

"పెళ్ళి లేకుండా ఇంట్లో కూచుంటావా?"

పెళ్ళాడితే ఇలాంటి దేబెలనా?"

"మొగపిల్లలంతా యిప్పుడిదే మచ్చు"

"అడుక్కు తిన్నట్టుందా మొగతనం"

"ఇంకేం చెప్పగలనండీ?" అనడిగింది రాధమ్మ నిష్ఠురంగా భర్తకేసి చూస్తూ.

"అమ్మాయి సిసలుగా చెప్పింది. ఏం అలా చూస్తా" వేమ నడిగాడు యాజులు.

ఇలా అని కప్పులూ సాసర్లూ సద్ది, కాఫీ పోసింది రాధమ్మ.

ముగ్గురూ కాఫీలు పుచ్చుకున్నారు.

"నేనిస్తా నుండుతల్లీ" అని తల్లి అంటూనే వుండగా, వారి కిద్దరికీ తానే తమలపాకులూ వక్కపొడి అందించి. తానున్నూ వేసుకుని, ఇద్దరి సెలవూ పొంది, స్వయంగా కారు నడుపుకుంటూ పాఠశాలకి వెళ్ళిపోయింది కృష్ణవేణి.

ఒక్కక్షణం యేమిటో ఆలోచించి "నేనొక్కటి చెబుతాను వింటారా?" అనడుగుతూ యాజులు కూచున్న కుర్చీ చేతిమీద కూచుంది రాధమ్మ.

## 2

కృష్ణవేణి బి. ఏ. పట్టం పుచ్చుకుని రెండేళ్ళయింది.

మద్రాసు క్వీన్ మేరీస్ కాలేజీలో చదివాటప్పుడు ఆ ప్రతిభా, చాకచక్యమూ చూసి ప్రిన్సిపాలు ఆమెని కన్నబిడ్డకంటే ఎక్కువగా చూసుకునేది.

పట్టాపుచ్చుకుని, ఆమె రాజమండ్రీ వచ్చేస్తూవుంటే "నేను నిన్ను విడిచి వుండలేను. నిన్ను ఎం. ఏ.లో నెగ్గించి యీ కాలేజీలోనే నాకు చేదోడు వాదోడుగా వుంచుకుంటా"నంటూ చాలాదూరం చెప్పింది.

బతిమాలింది; కాని కృష్ణవేణి వినలేదు.

ఆమె తల్లిదండ్రులను విడిచి వుండలేక పోయింది.

తనని విడిచి తల్లిదండ్రులూ వుండలేరని గుర్తించుకుంది.

"నేను ఎం. ఎ. లో నెగ్గితే నాకేం వస్తుంది? నేనీ కాలేజీలో వుంటే నావాళ్ళకి నేనెంతమందికి విద్యాదానం చెయ్యగలుగుతానూ? మీకు కోపంవద్దు. ఇప్పటి విద్యావిధానం ఏమీ బాగా లేదు. "మనం డబ్బున్నవాళ్ళం" అనుకునే వాళ్ళకి తప్ప "చదువుకుందాం" అనుకునేవాళ్ళ కిది అందుబాట్లోలేదు. ఇక్కడ ప్రవేశించగలిగిన వాళ్ళయినా అందరూ వుద్యోగాలాసించి వచ్చేవాళ్ళే. ఇది నాకు నచ్చలేదు" అని ఆమె తన అసమ్మతి తెలిపింది ముందు.

"మావూళ్ళో నేనొక పాఠశాల నడుపుతాను. ప్రారంభోత్సవం మీ చేతిమీదుగానే జరిపిస్తాను. నాపద్ధతి మీ కప్పుడు తెలుస్తుంది" అని కూడా చెప్పింది తరవాత.

ఆమె యింటర్మీడియేటు చదివాటప్పుడు యాజులు వివాహ ప్రస్తావన చేశాడు; గాని "చదువు పూర్తికానివ్వండి నాన్నారూ" అని ఆమెకోరగా ఆ ప్రయత్నం విడిచి పెట్టేశాడు.

ఇంటికి వచ్చాక యేడెనమండుగురు యువకు లామె నాశించివచ్చారు; గాని ఆ సంబంధాలు చివరికి రాధమ్మ కయినా నచ్చలేదు.

అప్పుడే ప్రారంభించిందామె, పాఠశాల.

యాజులు, తన పెన్షను అయిదువందల్లోనూ "నువ్వేం చేసుకున్నాసరే" అంటూ నెలకి రెండువందల యాభై రూపాయ లామె కివ్వసాగాడు.

ఆమె ఆ డబ్బుతో, నెలకి యాభై, ముప్ఫయి, యిరవై రూపాయల జీతంతో ముగ్గురు వుపాధ్యాయురాళ్ళ నేర్పరించింది.

ఆముగ్గురూ సర్కారు ట్రెయినింగు స్కూల్లో చదివినవారే; కాని అది పనికిరాదని కొత్త ట్రెయినిం గిచ్చిందామె.

కూతురి ఏర్పాట్లు చూసి యాజులు "ధన్యుణ్ణి" అనుకున్నాడు.

తెనుగొక్కటే ఆమె పాఠశాలలో భాష.

చూసిరాత, ఉక్తలేఖనం, కొంచెం లెక్కలు, కుట్టుపనులు, గృహ కృత్యాలు, సంగీతం — ఇంతే ఆమె ప్రణాళిక.

ఇప్పటి తెనుగుస్త్రీలు కూపకూర్మా లయివున్నారు.

మతసంబంధ మైన మూర్ఖా లలావుండగా పురుషుల అజ్ఞానం కూడా వారిని పశువుల స్థితికి తీసుకువెళ్ళింది.

వారికి దేశం, జాతి, భాష, మతం, సంఘం — ఏమీ తెలియదు.

ప్రపంచం ఎంత విశాలమో అందులో ఎన్ని దేశాలున్నాయో, వాటి వైలక్ష్యం ఏమిటో వారికి సుతరామూ తెలియదు.

మొగుడు గుమ్మంలోవుంటే గాని నడివీధిలో నిటాగ్గా నుంచోలేరు. నలుగురూ సాయంపడితే తప్ప పక్కవూరయినా సొంతంగా వెళ్ళలేరు. ఇంటికి వచ్చిన బిచ్చగాణ్ణి కూడా గదమాయించలేరు చివరికి.

ఇది మార్చాలనుకుం దామె.

దీనికి తగిన గ్రంథా లేరుకుం దామె. కొన్ని తానే రాసింది. అవే తర గతులవారీగా బోధిస్తుంది పిల్లల కామె.

ఉదయమూ సాయంత్రమూ స్నానం తప్పదు పిల్లలకు.

ఆమె పాఠశాలకోసం వొక గుర్రమూ నాలుగు సైకిళ్ళూ కొంది. తన మోటా రుంది. అవి నడపడమూ, గుర్రపు స్వారీ ప్రతీపిల్లకి నేర్పుతుంది.

ఊరిపిల్లలు దర్జాగా సొంత సైకిళ్ళమీద వస్తారు పాఠశాలకి.

మునిసిపాలిటీతో పోరీ, సర్కారుని వూదరగొట్టీ గోదావరిరేవు సంపా దించింది యాభై గజాల వెడల్పున. మునిసిపాలిటీవారే దానికి దక్షిణానా

వుత్తరానా ముళ్ళతీగలతో ఆవరణ నిర్మించారు. బాలికల వుపయోగంకోసం వొక షెడ్డుకూడా నిర్మించి ఇచ్చారు.

అక్కడొక పోలీ సెప్పుడూ వుంటాడు. అక్కడ పడవ లాగకుండా చెయ్యడమూ, నీళ్ళకోసమూ స్నానాలకోసమూ గూడా యెవరూ అక్కడికి రాకుండా చూడ్డమూ, పురుషు లా ప్రాంతాన విహరించకుండా చూడ్డమూ— ఇవి ఆ పోలీసు విధులు.

ఆమె ప్రతీరోజునా ఉదయమూ సాయంత్రమూ బాలికలను తీసుక వచ్చి యీతాలాడిస్తుంది.

ఉదయం ఎనిమిదినుంచి పదకొండుదాకానూ, మధ్యాహ్నం మూడు నుంచి అయిదున్నరదాకానూ పాఠశాల తెరిచి వుంటుంది.

పాఠశాల గంటల్లో స్త్రీలు వచ్చి చూస్తూ వింటూ వుంటారు చాలా మంది. వారికోసం గాలరీ లేర్పాటుచేయించిందామె.

అప్పుడప్పుడామె టవున్‌హాల్లో ఉపన్యాసాలిస్తూ వుంటుంది స్త్రీలను చేర్చి.

మార్షల్ లాకంటే కఠినమైన నిబంధన లమలుజరుపుతుం దామె పాఠశాలలో.

## 3

మధ్యాహ్నం వొంటిగంటవేళ కృష్ణవేణి, ఏదో చదువుకుంటూ వుండగా యాజు లామె కొక వుత్తరం అందించాడు.

అందులో యిలా వుంది.

"బ్రహ్మశ్రీ, మహారాజశ్రీ, శ్రీచేబోలు రామచంద్ర యాజులు రిటైర్డు జిల్లా జడ్జీగారి సన్నిధికి—

అయ్యా, అనేక నమస్కారాలు.

తమ రెరిగివున్న మద్దూరి వేణుగోపాలశాస్త్రీ నేనూ స్నేహితులం.

తమ అమ్మాయి కృష్ణవేణి బి.ఏ.గారికీ తనకూ వివాహం స్థిరపడి వుండినట్టూ, కాని, ముహూర్తం స్థిరపరిపించుకోడమే తరవాయిగా వుండగా కట్నం విషయమై పేచీవచ్చి సంబంధం తిరిగిపోయినట్టూ, తాను, అదివరకే, రెండువేల కట్నమూ, అయిదువందల లాంఛనాలూ యిస్తామని, తరిమి తరిమి చెబుతూ పట్టుకు పాకులాడుతూవున్న మరో సంబంధం వెంటనే స్థిరపరచు కున్నట్టూ ముహూర్త నిశ్చయం కూడా అయిపోయినట్టూ ఇప్పుడే చెప్పివెళ్ళాడు.

నేను తమ కీవుత్తరం రాయడాని కీవిధంగా కారణమూ అవకాశమూ ఏర్పడ్డాయి.

నేను మీ అమ్మాయిగారిని పెళ్ళిచేసుకోవా లని అభిలషిస్తున్నాను.

నన్ను మీ రెరుగుదురు. మీ అమ్మాయిగారున్నూ యెరిగే వుంటారని నమ్ముతున్నాను.

నాపేరు సుసర్ల కోటీశ్వరశాస్త్రి. మాస్వస్థలం అమలాపురం తాలూకా మోడేకుర్రుగ్రామం. నేను బి.ఏ., ఎల్.టి.పరీక్షలో నెగ్గివుండి, ప్రస్తుతం, రాజమండ్రి మునిసిపల్ హైస్కూల్లో ఆక్టింగుగా పనిచేస్తున్నాను.

ఇది ఎప్పుడు ఖాయం అవుతుందో చెప్పలేను. కాకపోతే, ఆక్టింగు మాత్రం ఇంకా కొన్ని సంవత్సరాలపాటు జరుగుతుంది.

నాకు సాలీనా రెండువందల రూపాయలు వచ్చే భూవసతిమాత్రమే వుంది. స్వగ్రామంలో చిన్న పెంకుటిల్లున్నూ వుంది.

నావయస్సు; ముప్పయిరెండోయేడు మొన్ననే జూలైలో ప్రవేశించింది. రెండేళ్ళకిందట నా మొదటిభార్య గతించింది. సంతతి కలగనే లేదు.

అరవై యేళ్ళ అమ్మగారూ, నలభై యేళ్ళ వితంతుసోదరీ — ఇంతే మా ఇంటో జనం.

నాకు కట్నం అక్కర్లేదు. లాంఛనాలతోనూ పనిలేదు. పెళ్ళికి నేను ఖర్చుచెయ్యదలచిన—చెయ్యగలిగిన మొత్తం నూరురూపాయలు.

నాయోగ్యతలు తమ కందరికీ నచ్చి నాస్థితి విషయమైకూడా సంతృప్తి కలిగితే నేను తమ అమ్మాయిగారిని పెళ్ళి చేసుకోవాలని ఆశిస్తున్నాను.

నేను రేపు మధ్యాహ్నం రెండుగంటలవేళ మీదర్శనానికి వస్తున్నాను. నావిషయమై మీకెలాంటి ఆక్షేపణలూ లేకపోతేనే నాకు దర్శనం ఇప్పించండి. లేకపోతే దర్శనమే ఇవ్వవద్దు.

దర్శనం ఇచ్చినా తమక్కావలసిన వివరాలన్నీ తెలుసుకోడానికి అప్పుడున్నూ మీకు తృప్తికలక్కపోతే తిరస్కరించడానికి తమకేమీ అడ్డు లేదు.

ఇట్లు విధేయుడు.

రాజమండ్రి సుసర్ల కోటీశ్వరశాస్త్రి

ఉత్తరం పూర్తిచేసి "వారిని మీ రెరుగుదురా నాన్నారూ?" అనడిగింది కృష్ణవేణి.

"ఎరుగుదును. టెన్నిస్ ఆటలో మంచి నిపుణుడు. నిరుడి వూళ్ళో పోటీ ఆటలు జరిగాయి చూడూ, అప్పడు నెగ్గినవాడతనే. అతణ్ణి సత్కరించడానికి

విద్యార్థులు చేసిన సభకు నేనే అధ్యక్షత వహించాను. విద్యార్థులు బహుమతీ చేసిన నూరురూపాయల పెన్నిస్ బాటూ నేనే అందించా నతనికి''

"అమ్మ యేమంటుందో?''

"ఈ పుత్తరం మీఅమ్మా చూసింది. ఆస్తి బొత్తిగా తక్కువ అంటుం దామె. అయినా, బాధ్యత అంతా నామీదా నీమీదా మోపింది''

కృష్ణవేణి మొగం వంచుకుంది.

ఒక్కక్షణం నిదానించి "అతను వస్తానన్నవేళ కావచ్చింది నీవుద్దేశం యేమిటి తల్లీ?'' అనడిగాడు యాజులు.

''ఎల్.టి." అంటే—

''పాత బి. ఏ. అన్నమాట''

''అప్పట్నుంచీ స్థిరమైన వుద్యోగం, సంపాదించుకో లేకపోడం—''

"ఆలోచించతగ్గదే."

"మరో వృత్తి అయినా అవలంబించలేదు."

"పరువు తక్కువ అనుకున్నా డేమో?"

"రోజుకొక పార్టీ. పూట కొక ముఠా. పైగా, కులాభిమానులు. మునిసిపాలిటీ చివరి కేం చేస్తుందో?"

"చెప్పలేము."

కృష్ణవేణి ఒక్కక్షణం ఆలోచించింది.

"వారి రూపురేఖ లెరుగుదును. చురుకయినవారనీ, ప్రతిభావంతులనీ, అనుకుంటున్నాను. మీకేమీ ఆక్షేపణ లేకపోతే దర్శనం ఇవ్వండి''

"వారు కోనసీమ స్వాములు. ఆలోచించావా?''

"ఏమయినా, ముందు వారికి మన షరతులన్నీ నచ్చాలి గదా?''

"..............."

"దర్శనం ఇవ్వండి నాన్నారూ."

"లాలో లేని పాయం ప్లెత్తుతారు కోనసనీమ—"

"జడ్జీ అనాధ అయితేనూ, అంతేనా నాన్నారూ?"

యాజులు చిరునవ్వు నవ్వాడు.

"నా అభిప్రాయం అమ్మకి చెప్పి, మీకిద్దరికీ నచ్చితేనే దర్శనం ఇవ్వండి."

యాజులు హాల్లోకి వెళ్ళిపోయాడు.

పుస్తకం కిందపెట్టేసి, మేజామీద గాజుబరిణెలో వున్న యేలకిపండొకటి తీసి వొలిచి నోటవేసుకుని ఆలోచన ప్రారంభించింది కృష్ణవేణి.

కృష్ణవేణి చూపుల్లో, శాస్త్రికి, స్వాగతపలకం మిక్కిలి ఉజ్వలంగా కనపడింది.

అందరూ మేజాచుట్టూ కూచున్నారు.

యాజు లందుకున్నాడు.

"కట్నం విషయమై మీరు బాగా ఆలోచించుకునే వచ్చారా?"

"చిత్తం"

"..........."

"అది మీకు దృఢమైన వ్రతం అని గుర్తించుకున్నాను. నాకా ఆశ లేశమూ లేదు. మీరు నమ్మవచ్చు"

"నాకు కృష్ణవేణి వొక్కర్తే బిడ్డ. నాకున్న యావదాస్తీ ఆమెది. నేను దత్తత చేసుకోదలుచుకోలేదు"

"చిత్తం"

"నాది రెండులక్షల ఆస్తి. బతికి వుండినంతకాలమూ నాకు పెద్ద పెన్షను వస్తుంది; కాని యిందులో సూటిగా మీకేదీ స్వాధీనపడదు"

"ఇష్టపడ్డాను"

"మీకిప్పటికింకా స్థిరమైన వుద్యోగం లేదు. ఉద్యోగం కోసం మీరు మరో చోటికి వెళ్ళవలసి రావచ్చు. అయితే, మా అమ్మాయి ఈ వూరువిడిచీ మమ్మల్ని విడిచీ యెక్కడికీ రాదు."

"అది కొంచెం కష్టమైన షరతే, నేనే సద్దుకునే వుపాయాలు లేకపోలేదు"

"ఇంతకీ, వూరికే వుండడం యిష్టం లేకపోతేనే మీరు మరోచోట ఉద్యోగప్రయత్నం చెయ్యడం; కాని అగత్యం వుండదనే నా నమ్మకం"

"చిత్తం"

యాజులు తనకేసి చూడగా కృష్ణవేణి అందుకుంది.

"నేనొక పాఠశాల నడుపుతున్నాను. స్త్రీలలో కొత్త దృక్పథం ప్రవేశ పెట్టాలనీ, వారి జీవితాలకు కొత్తవిలువలు కట్టాలనీ నా ప్రయత్నం. నా జీవిత లక్ష్యాలివి."

"సంతోషం"

"ఒకటి నాభర్త. రెండు నా తల్లితండ్రులు, మూడు నా పాఠశాల, ఇంతే నాప్రపంచం. నాప్రేమా, నాశ్రద్ధా ఈ మూడు వస్తువులమీదా యథార్థంగా వినియోగపడతాయి"

"బోధపడింది. చాలా సంతోషం"

"భార్య అంటే బానిసకాదు, సమానభాగస్వామిని. నాహక్కులు నేను పూర్తిగా అమలు పరుచుకుంటాను"

"తెలిసింది. అంగీకరించాను"

"భర్తవైపువారిని నేను భక్తితో పూజిస్తాను. అయితే, వారు నన్ను ప్రేమిస్తేనే జరుగుతుం దిది"

"బాగుంది"

"'అవసరం వచ్చినపుడు గృహిణి చెలాయించుకోవలసిన అధికారాలన్నీ నేను దఖలు పరుచుకుంటాను.''

"'అలాగే చెయ్యవచ్చు''

"సభలకు వెళ్ళడమూ, పురుషులతో కలిసే కూచోడమూ నాకలవాటు, ముందున్నూ అది అలా జరుగుతూనే వుంటుంది.''

"నాకేమీ ఆక్షేపణ లేదు''

''నే నొంటరిగా పొరుగూళ్ళు వెళ్ళడం వుంది. ముందు ముందున్నూ అలా వెడుతూనే వుంటాను"

''వెళ్ళవచ్చు''

కృష్ణవేణి తల్లికేసి చూసింది.

''మీఅమ్మా, మీఅక్కా రజస్వల అయినపిల్ల చేతి అన్నం తింటారా?'' అనడిగింది వెంటనే రాధమ్మ.

చకితుడై ''అవునవును. అది ఆలోచించవలసిన విషయమే'' అన్నాడు యాజులు, అవ్యవధానంగా అందుకుని.

శాస్త్రికి నవ్వు వచ్చింది; కాని ఆపుకున్నాడు.

''రెండుపూట్లా మావాళ్ళే వంట చేస్తారు. కనక, మీ అమ్మాయిగారు పొయ్యిదగ్గరికి వెళ్ళవలసిన అగత్యమే తటస్థించదు. అంత అగత్యం వస్తే అప్పు డభ్యంతరం వుండదనే నానమ్మకం'' అన్నాడతను.

అందరూ వొక్కక్షణం వూరుకున్నారు.

''బాగా ఆలోచించుకుని వర్తమానం పంపండి'' అన్నాడు యాజులు.

"నాకేమీ ఆలోచనలేదు. మేమనుకోని కొత్త సంగతులు వచ్చాయి. అయినా నాకిష్టమే. ఇక మావాళ్ళ సంగతి. మా అమ్మా అక్కా సాయంత్రం అయిదుగంటల కిక్కడికి వస్తారు. తమ ఆక్షేపణ లేదని చెప్పడానికే వస్తారు"

ఇలా చెబుతూ కోటీశ్వరశాస్త్రి లేచి నమస్కారాలు చేశాడు.

అందరూ వీధిగుమ్మం దాకా సాగనంపా రతణ్ణి.

గట్టిగా పిలిస్తే మరదలి కెక్కడ వినపడిపోతుందో అని, ఆమె, కంఠం నొక్కుకుని పిలుస్తూ మళ్ళీ కదిపింది, కాస్త ఎక్కువగా.

కొంచెం మెలకువ వచ్చింది; గాని గోడవైపు తిరిగి, గుర్రుకొట్టడం ప్రారంభించాడతను.

మళ్ళీ మళ్ళీ కుదిపిందీమాటు.

చెవిలో నోరుపెట్టి "అబ్బాయీ" అంది.

"అబ్బా!........... ఎందుకే?" అంటూ ముసముస లాడాడతను.

"ఏడు కొట్టేసిందిరా గడియారం"

"అయితే?"

"నీపెళ్ళాం లేవడమే కాకుండా, మొగం కడుక్కొని స్నానం చేసి—"

"చేసి?"

"కాఫీకి నీళ్ళు కూడా కాచేస్తోంది"

"కాఫీ కలిపాటప్పటికి నేను సిద్ధం కాలేనంటావా?"

''బాగానే వుంది. అది శుచిగా పుచ్చుకుంటే, నువు పాచిమొగంతో—"

''అబ్బ, చంపుతావే నువ్వు"

''ఇలా అయితే లోకువయిపోవుట్రా నువ్వు."

''సింగినాదం కాదూ?''

విసుక్కుంటూ అతనిలా అన్నాడే కాని ధైర్యం చాలక లేచి కూచున్నాడు కళ్ళు మాత్రం మూసుకునే వుండి.

''లే, లే, తొరగా మొగం కడుక్కో, అది చన్నీళ్ళే పోసుకుంది; కాని నీకు వేన్నీళ్ళు—''

''తొరుపు"

'అదెంత సేపురా?''

''నువ్వు చన్నీళ్ళు తోడాటప్పటికి నేను మొగం—"

"మరి, మంచం దిగు"

''నువ్వు పద"

అతను లేస్తాడనుకుని రాజమ్మ మొగం వంచుకుని బయలుదేరింది కాని గుమ్మందాకా వచ్చి యిట్టే వెనక్కి చూడగా అతను మంచం దిగకపోడమే కాదు, మళ్ళీ వొరుగుతున్నాడు.

అది చూసి రాజమ్మ అగ్గయిపోయింది.

ఒక్క అంగలో మళ్ళీ దగ్గిరికి వెళ్ళి, సగం వొరిగినవాణ్ణా సగంలోనే

జబ్బలు పట్టుకుని ఆపి "వొరేయ్, బుద్ధి వుందా లేదా నీకు? ఇందాకణ్ణుంచి చిలక్కి చెప్పినట్టు - దిగుమంచం" అంటూ గుంజిగుంజి విడిచిపెట్టిందామె.

"ఇంత పెందాలాడే లేస్తే నాకు తలనొప్పి—"

"ఏమయినా సరే, ఎనిమిది కొట్టేదాకా పడుకుంటే నీకిక సాగదు. ఆడదానికి లోకువయిపోయావంటే, గుడ్డిగవ్వకు మారవు నువ్విక, తెలుసా?"

ఎప్పుడో అయిపోడంకాదు, ఇప్పటికే అయిపోయి వుండడం తెలుసు అతనికి.

కాగా, కళ్ళు మూసుకునే వుండి వొక్క జోగు జోగి, అంతలో వులిక్కిపడి కళ్ళు తెరుచుకుని "హు!........... అయితే పద" అంటూ మంచందిగాడతను.

ఇక పరవాలేదనుకుని గబగబా వెళ్ళిపోయింది రాజమ్మ.

వెడుతూ వెడుతూ ఆమె, వంటింటి వసారాకేసి వోరకంట చూడగా కృష్ణవేణి, ఫిల్టర్లో వుడుకునీళ్ళు పోసి, పాలగిన్నె అప్పుడే కుంపటిమీద పెడుతోంది.

దీంతో మళ్ళీ కంగారెత్తగా, రాజమ్మ, వొక్కదూకున నూతిపెరట్లో అడుగుపెట్టి వెనక్కి తిరిగి చూసింది.

గూట్లోవున్న కానుగుపుల్ల తీసి నోటవుంచుకుని శాస్త్రి కొంచెం తూల్తూ వస్తున్నాడు.

కోడలు కాఫీ తయారుచేస్తున్నందుకు సంబరపడి "స్నానం కూడా చేసే కాఫీ పుచ్చుకో నాయనా" అంది కొడుకుని, మహాలక్ష్మమ్మ.

## 7

శాస్త్రి పొడిబట్ట కట్టుకునేటప్పటికి తాను తెచ్చిన తల నూనె చేతులకు రాసుకుని సిద్ధంగా వున్న కృష్ణవేణి నిమిషంలో తల దువ్వేసిందతనికి.

అతను చొక్కా తొడుక్కునేటప్పటికి తుంగచాప పరిచి తానొక చివర కూచుని కాఫీ కలిపేసింది.

అతను కూచునేటప్పటికి కప్పు చేతి కదించింది.

వీధిలో మోటారు హారను.

ఉలిక్కిపడి చూశాడు శాస్త్రి.

''నా కోసం వచ్చిందికారు" అంది కృష్ణవేణి.

మొదట అతని కర్థం కాలేదు; కాని వొక్క స్పూను కాఫీ చప్పరించాటప్పటికి పాఠశాల సంగతి జ్ఞాపకం వచ్చి "ఊహూ" అంటూ తలవూపాడు.

''కాఫీ బాగుందా?" అనడిగింది కృష్ణవేణి, విలాసంగా చూస్తూ.

''చాలా బాగుంది. మద్రాసులో గాని యిలాంటిది దొరకదు"

''చాలా సంతోషం. దినమ్మూ యిలా చెయ్యవచ్చు నన్నమాట''

''నిరభ్యంతరంగా; కాని నీకు శ్రమ పాపం"

''శ్రమ కాదిది పరిశ్రమ............మీరుచి కనుగుణంగా చెయ్యలేనేమో అని చాలా భయపడ్డాను........నిజంగా బాగుందా?"

గునుస్తూ యిలా అడిగిందామె.

ఈ షదుచ్చలితాలై సీమకమలాల దుద్దులు అతని కళ్ళల్లో మెరుపు తీగలు పాకించాయి.

''ముఖప్రీతిగా చెప్పలేదు నేను. అన్నమూ కూరలూ బాగుండకపోయినా సద్దుకోవచ్చు; గాని, కాఫీ బాగుండకపోతే మాత్రం మతి పోతుంది''

''.............."

''నిజమే చెప్పాన్నేను. చాలాచాలా బాగుంది కాఫీ"

కృష్ణవేణి మొగాన సంతోషం లాస్యం చేసింది.

మళ్ళీ వీధిలో మోటారు హారను.

''అక్కా" అని పిలిచాడు శాస్త్రి, ద్వారంకేసి చూస్తూ.

అప్పటికి గుమ్మం పక్కనే పొంచుండ వింటోంది దంపతుల సంభాషణ, రాజమ్మ.

అయితే పిలుపు వినపడేటప్పటికి పిల్లిలాగ వంటింటిదాకా ముంగాళ్ళ మీద పరుగెత్తుకువెళ్ళి, అక్కడ గభీమని వెనక్కి తిరిగి, లోపల తానేదో పనిమీద వుండగా వినపడ్డట్టు "పిలిచావా తమ్ముడూ" అని యెదురు పిలిచింది.

"ఎందుకూ?" అన్నట్టు కృష్ణవేణి చూస్తూనే వుంది; కాని అతనది గమనించకుండా "కాఫీ పుచ్చుకుంటున్నారని డ్రైవరుతో చెప్పిరా" అన్నాడు.

''అక్కర్లేదండీ వదినా, మీరు వెళ్ళనక్కరలేదు, తాను వచ్చినట్లు నాకు తెలియడానికి రెండుమాట్లు హారన్ వేస్తుంది. డ్రైవరు. అంతే" అంది కూచునే వుండి, కృష్ణవేణి.

అప్పటికప్పుడే వారి యెదటికి వచ్చింది; కాని మరదలి మాట విని వెనక్కి చక్కాపోయింది రాజమ్మ.

"మధ్యాహ్నం మీకు కాఫీమాట యేమిటి?"

"హోటల్లో పుచ్చుకుంటాను"

''ఇంటికి రావడానికి—"

"సైకిలుండినా రెండుమైళ్ళ పైచిలుకు రానూపోనూను. వచ్చినా సావకాశంగా కూచుని పుచ్చుకోడానికి వీలుండదు. ఉడుకూ మడుకూ కడుపులో పోసుకుని ఉరుకులూ పరుగులూ పెట్టాలి, యేం సుఖమూ?"

"సైకిలుమీద డ్రైవరుచేత ఫ్లాస్కులో పంపుతాను"

"ప్రస్తుతం వద్దు, ముందుముందు చూసుకుందాం"

నిమిషంలో కప్పులూ, సాసర్లూ, స్పూనులూ కడిగితెచ్చి బీరువాలో వుంచేసి, అతని దగ్గిరగా నుంచుని "పాఠశాలకు వెళ్ళవచ్చునా?" అనడిగింది, కృష్ణవేణి.

అప్పటికప్పుడే వొక యేలకిపండు వొలిచి నోటవుంచుకుని వుండిన శాస్త్రి, మరో పండు వొలిచి "నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు" నంటూ ఆమె నోట వుంచాడు.

అప్పుడామె చిరునవ్వు నవ్వుతూ అతనికంఠం పెనవేసుకుని "వొక్క నిమిషమైనా ఆలస్యం చెయ్యడం నాకిష్టం కాదు. కనక దయవుంచి—రేపణ్ణుంచి—మీరు—"అంటూమాట నాన్చేసిందామె.

దాంతో పరవశుడై రెండుచేతలా పొదివి పట్టుకుని ఆర్డరు కాగితంమీద మొహరువేసేటట్టు ఆమె పెదవులమీదొక కమ్మని ముద్దుంచాడతను.

తరవాత, గుమ్మందాకా బాహుబంధాల్లోనే వచ్చి, గుమ్మం దాటాటప్పు డొకరి నొకరు రాసుకుంటూ వుండి, క్రమంగా విడిపోయి వీధిలోకి వెళ్ళారు వారు.

మొగుడు మద్రాసులో బి. ఏ. చదువుతూ వుండడంవల్ల పుట్టింట వుండిన యెదటింటి ఆడబడచు, ఎడపిల్లను చంకన వేసుకుని కారువచ్చినప్పణ్ణుంచీ వీధిగుమ్మంలోనే నుంచుని వుండి, వారిని చూడ్డంతోనే గిరుక్కున మళ్ళి తలుపుచాటున నక్కి చూడసాగింది.

కృష్ణవేణిని చూడ్డంతోనే కారు దిగి, తలుపు తీసి, ఆమె యెక్కి కూచున్నతరవాత మళ్ళీ తలుపువేసి, వెళ్ళి తన స్థానంలో కూచుని, స్టార్టుచేసి హారన్‌వేసింది, డ్రైవరు.

భ్రూవిలాసంతో భర్త సెలవు పుచ్చుకుంది కృష్ణవేణి.

మందహాసం చేస్తూ చెయ్యూపాడు శాస్త్రి.

భొంయిమంటూ కారు వెళ్ళిపోయింది.

ఇదంతా చూసి, మొగం ముడుచుకుని వంటింటికేసి చక్కాపోయింది, రాజమ్మ.

# 8

రాధమ్మా, యాజులూ, కృష్ణవేణి యేకబంతిని భోజనాలకు కూచున్నా రావేళ మధ్యాహ్నం.

"నిన్న రాత్రి అన్నం నోటికి పోలేదమ్మా" అన్నాడు యాజులు.

"అనుకుంటూనే వున్నా నాన్నారూ, రాత్రి వారికీ నాకూ యేకబంతిని వడ్డించారు మాఆడబడుచు. అయినా, అమ్మా మీరూ లేకుండా భోజనం చెయ్యడం నాక్కూడా యెలాగో అనిపించింది. రెండుమాట్లు కొలకమారింది కూడా"

"చూశారా?" అనడిగింది రాధమ్మ భర్తని.

అతనికీ కొలకమారింది, భోజనం దగ్గిర రాత్రి.

"అమ్మాయి మిమ్మల్ని తలచుకుంటోందందండి" అంది రాధమ్మ.

అది జ్ఞాపకం చేసిందిప్పుడామె.

"భోజనం చేసినంతసేపూ మీమాటే అనుకున్నానండీ! ఎంత సద్దుకున్నా "నీమూలాన మీఅమ్మా మీనాన్నారూ ఇక సగం సగమే భోజనం చేస్తారు, తెలుసా?" అంటూ ఎవరో నిలవతీస్తున్నట్టే వుందండీ నాకు"

"నాకేమమ్మా? నేను బాగానే భోజనం చేశాను. మీగడపెరుగు వద్దని మీఅమ్మ చేసిన మజ్జిగ పోయించుకుంది. ముందే నాకు పోసేసింది సుభద్రమ్మ, లేకపోతే—"

"అవునుటే అమ్మా?"

ఇలా అడిగింది కృష్ణవేణి, చురుగ్గా చూస్తూను.

"అబ్బే లేదు తల్లీ! కొంచెం మందకొడిగా వుండడంవల్ల రాత్రి పెరుగు మానేశానంతే. మీనాన్న మరీనూ. మాటమీద మాట యిట్టే అల్లేస్తారు"

"వొట్టిదమ్మా, మీఅమ్మ చెప్పిందంతా అబద్ధం. నాకు బాగా తెలుసు. నువ్వు బంతిలో లేకపోడం—పైగా, నువ్వు నీయింటికి వెళ్ళిపోడం—దీనివల్ల బెంగతప్ప మీ అమ్మకి మందకొడీ లేదు, మరేమీలేదు"

"అయితే, మీకు మాత్రం లేదా యేమిటి బెంగ?"

"నాకూ వుంది. ఎక్కువగానే వుంది. కాని నాకూ నీకూ భేదం వుంది. నీది తల్లిప్రాణం"

ఈమాటతో రాధమ్మ మనస్సు దేవేసినట్టయిపోయింది.

"సంబంధాలు రానంతసేపూ అయ్యో, యెలాగమ్మా?" అనిపించేది. నిరుక్తైన సంబంధం తిరిగిపోతే ప్రాణం పోయినట్టే వుంది. ఆస్తి తక్కు

వయినా మళ్ళీ యేదోవొక సంబంధం వచ్చి స్థిరపడగా కొండయెక్కినట్టుంది. కార్యం నాలుగురోజులూ వురకలు వేసింది. ఇలాగ దాన్ని మరోయింటికి పంపి వేసే ప్రయత్నాలు—ఇష్టాపూర్తిగానే చేస్తూ వుండీకూడా—నిన్న సాయంత్రం దాని యింటికది వెళ్ళాక వొక అయ్యచేతిలో పెట్టాక—"

రాధమ్మ మరి మాట్టాడలేక పోయింది.

గిర్రున తిరిగాయి కళ్ళలో నీళ్ళు.

పెదవులు రావిరేక లయిపోయాయి.

అది చూశాటప్పటికి యాజులు కళ్ళూ చెమ్మగిల్లాయి.

ఆ యిద్దర్నీ చూచి కృష్ణవేణి—

భోజనాలు మానేసి ముగ్గురూ పీటలకు జేరబడిపోయారు.

ఇదంతా గమనిస్తూనే వున్న సుభద్రమ్మ గభీమని ముందుకి వచ్చింది.

"ఆడపిల్లని కన్నవాళ్ళ కిదే బాధండీ బాబుగారూ" అంటూ అందుకుంది.

నానాబాధలుపడి, పెంచి, వొకరి ఇంటికి పంపెయ్యడం - కానయితే, లోకం అంతటా వున్నదే ఇది. ఎవరికీ తప్పనిది కూడాను ఇది. మంగళకరం కాని మరోటి కాదు కూడాను. అయినా, చేతులతో దేవేసిన ట్టయిపోతాయి గుండెలు. మా అమ్మాయి కాపరానికి వెళ్ళిన కొత్తలో నేనూ ఇలాగే బాధ పడ్డాను. తరవాత అలవాటయిపోయింది. ఆరేళ్ళనుంచీ అమ్మాయికూడా చాలా చనువు కావడంవల్ల నిన్న రాత్రినుంచీ నాకున్నూ ఎలాగో వుంది, కన్నకడుపు మీమాట చెప్పడాని కేం వుందీ? అవతలివారు వారిని నెత్తిమీద పెట్టుకున్నా కండలో కండ కోసేసినట్టు మనకి తల తిరిగి పోతుంది. అయినా తప్ప దిది, తప్పించుకోనూలేము. ఆ ప్రయత్నం కూడా చెయ్య మసలు. పైగా, దానికోసం ఎంత వుబలాటమూ? ఎంత ప్రయత్నమూ, ఎంత హైరానపడ్డమూ,? .......అయితే, అమ్మాయీ మీరు భోజనం చేస్తేగాని మీ అమ్మా, మీ నాన్నా మెతుకులు ముట్టరు. పులుసు తెమ్మంటారా, చారా?" అనిన్నీ అడిగింది ధోరణి మార్చేసి.

అందరూ ప్రకృతిలో పడ్డారు.

మళ్ళీ కబుర్లలోనూ పడ్డారు.

భోజనాలున్నూ పూర్తిచేశారు.

## 9

కారు దిగి కృష్ణవేణీ, యెదటింటి చీడీలు దిగి రాజమ్మా వొక్క మాటే గుమ్మం ఎక్కారు.

"ఎక్కణ్ణుంచి వదినా?"

"ఎదటింటివారి అబ్బాయికి పెళ్ళివారు వచ్చారు. చూద్దా మని వెళ్ళగా ఇప్పటిదాకా కూచోబెట్టారు. అక్కణ్ణుంచి వస్తున్నాను."

"రాత్రీ పగలూ రేడియోపెట్టు క్కూచుంటాడూ, ఆపిల్లవాడి కేనా?"

"అవును."

"వయస్సు—"

"మొన్ననే పదిహేడేళ్ళు నిండాయిట."

"పెళ్ళికూతురి కుండవలసిన వయస్సయినా లేదు కదా."

"సంబంధాలు మీద సంబంధాలు వచ్చి పడిపోతూంటే, ఏమి చేస్తారూ? రెండు మాసాల్లో ఇది నాలుగో సంబంధం. కాకపోయినా, పిల్లవాడి తండ్రి వేదశాస్త్రాలు చదివిన వారు, ఉద్యోగస్థులు కారు."

"అంత చిన్నతనంలో పెళ్ళి చెయ్యడానికి శాస్త్రం వొప్పుకుంటుందా? పోనీ, పెళ్ళి కూతురి వయస్సు—"

"మొన్ననే తొమ్మిదో యేడు వెళ్ళిందిట."

"ఛీ, ఛీ! అవతలివారు మనుష్యులా రాక్షసులా?"

రాజమ్మ బదులు చెప్పలేకపోయింది.

అప్పటి కప్పుడే వారు పడమటింటి దగ్గిరికి వెళ్ళారు.

తుంగచాప పరుచుకుని వొత్తులు చేసుకుంటూ వొకచోట కూచునివుంది మహాలక్ష్మమ్మ.

కూచో మని చాప చూపిస్తూ "రావే తల్లి" అంటూ కోడలిని పలకరించి "ఏమయింద' నడిగిం దామె కూతుర్ని.

ముగ్గురూ సర్దుక్కూచున్నారు.

"ఏమయిం" దన్నట్టు తల్లి తనకేసి, మళ్ళీ చూడగా రాజమ్మ అందుకుంది, కృష్ణవేణి నోరకంట చూస్తూ.

"కట్నం ఆరువేలకూ దమ్మిడీ తగ్గమన్నా రవధానులు గారు. ఆడబడుచుల కారుగురికీ ఆరు నూటపదహార్లూ, వియ్యపురాలికి నూటపదహార్లూ, పెళ్ళికొడుక్కి పట్టుతాపితాలూ, వెండిచెంబూ, వెండికంచమూ, రిష్టువాచీ, సైకిలూ—"

"బాగుంది" అంది మహాలక్ష్మమ్మ.

రాజమ్మ కృష్ణవేణికేసి మళ్ళీ చూసింది, వోరకంట.

అది గుర్తించేసింది కృష్ణవేణి.

"వీరికి కట్నం అంటే ఆక్షేపణ లేకపోడమే కాదు, చాలా ఇష్టంగానే

వుంది. మరి కట్నం వద్దంటూనే నన్నెందుకు చేసుకున్నారూ?" అని వితర్కించుకుంది.

"అయినా, చూదాం" అనుకుని "కొడుకు నమ్ముకోడాని కేశాస్త్రం అధికారం ఇచ్చిందో అవధానులు గారికి?" అనడిగింది చురుగ్గా చూస్తూ.

డబ్బు వస్తుం దంటే శాస్త్రం పట్టుక్కూచుంటారా ఏమి టవధానులుగారయితే మాత్రం?" అని ఎదురడిగింది రాజమ్మ అంతకంటే చురుగ్గా చూస్తూ.

"మరి శాస్త్రం చదివిన ప్రయోజనం ఏమిటీ?"

"సంగతులు తెలుసుకోడం."

"తెలుసుకుని?"

"సాగితే అలా నడుచుకోడం."

"ఈ కట్నమే గతా అవధానులుగారికి?"

"తప్పు తప్పమ్మా" అంది మహాలక్ష్మమ్మ, ముక్కుమీద వేలు పెట్టుకుని తల అడ్డంగా వూపుకుంటూ.

"డబ్బుదగ్గిర గతేమిటి గతి లేకపోవడం ఏమిటి? కాకపోయినా వైభవాల కొరకు దారేమిటీ, తెన్నేమిటి?"

"కట్నం పుచ్చుకోవడం వైభవమేనా?"

"ఆరుగు రల్లుళ్ళకీ ఆరు వెయ్యినూటపదహార్లు కట్నం ఇచ్చా రాయన. దాని విలువ ఆయనకే తెలుసు. కనక, ఆ మొత్తం అంతా ఈ వొక్క కొడుక్కీ రావాలని నిరుకుచేసుకున్నారు.

"నలభై యాభై వేల వడ్డీవ్యాపారం కూడా వుందమ్మా వారికి. లేనివారు కారు" అంటూ సర్దిచెప్పింది మహాలక్ష్మమ్మ.

"పైగా, వొక్క కొడుకు. ఆరుగురు కూతుళ్ళవెనక గారాలకూచి"

"అయితే మాత్రం? ఆడపిల్ల నమ్ముకుంటే వొకటీ, మొగపిల్లవాణ్ణమ్ముకుంటే వొకటీనా? ఎందుకు వచ్చిన చదువు, ఎందుకు వచ్చిన యేళ్ళు?"

మహాలక్ష్మమ్మ మిడుతూ మిడుతూ చూస్తూ వూరుకోగా మాటతోచక రాజమ్మా వూరుకుంది.

"ఆరువేలు కట్నమా? అవతలివారు దీంతో నేలమట్టం అయిపోవలసిందే కాదూ?"

దీనిమీద "వారికేం లోటూ?" అంది రాజమ్మ.

"అంటే?"

"వారికీ పుందిట, యాభై వేల వడ్డీవ్యాపారం"

"అదే వృత్తా వారికి?"

"బెజవాడలో పెద్ద బరందుషాపు కూడా వుంది, వారికి"

"సెబాస్, చాలా బాగుంది వదినా? ఇక్కడ నరమాంస విక్రయం చేసేవారూ, అక్కడ మద్యవిక్రయం చేసేనారూ వియ్యం అందడం చాలా గొప్పగా వుంది"

ఈ సమన్వయం చూసి తెల్లపోయింది మహాలక్ష్మమ్మ.

నోరెత్తలేకపోయింది రాజమ్మ.

"జపం చేసుకోడానికిక అవధానులు గారికి పీపాలతోనే సప్లయి"

"................"

"బహుశా, మొగపెళ్ళివారిలో ఆడవాళ్ళకి మొగవాళ్ళకి కూడా మనిషి వొక్కంటికి దినాని కొక సీసా చొప్పున దాహం యివ్వాలని కూడా నిర్ణయం చేసుకునే వుంటారవధానులుగారు, కాఫీ వుప్మాలతోపాటు"

"................"

"ఎలాంటి పుజ్జీకుదిర్చాడూ భగవంతుడు!"

"......... ......... ........."

"ఛీ, ఎందుకు వచ్చిన బ్రాహ్మణ్యం వదినా? ఆ పెళ్ళిమాట చెప్పుకుంటే మన నోళ్లు కూడా చెడిపోతాయి, వూరుకోండి"

కృష్ణవేణి అన్న వొక్కొక్కమాటా వొక్కొక్కపిడుగు కాగా, తల దిమ్మెత్తిపోయి నోరెత్తలేక, ఇటున్నూ చూడలేక వీధిగుమ్మం కేసి చూసింది రాజమ్మ.

అదేమిటో అని కృష్ణవేణి అలా చూడగా, గుమ్మం దాటకుండానే కోటు తీసివేసుకుంటూ కోటీశ్వరశాస్త్రి వస్తున్నాడు.

"అబ్బాయి వస్తున్నాడా?" అనడిగింది మహాలక్ష్మమ్మ.

ఆమాట పూర్తి కాకుండానే లేచియెదురువెళ్ళి, ఆకోటందుకుని అతనితో కూడా గదిలోకి వెళ్ళింది కృష్ణవేణి.

అది చూసి మిక్కిలీ అనందించింది మహాలక్ష్మమ్మ.

కాని, రాజమ్మ అక్కసు్స పెంచుకుంది.

కట్నం విషయమై కృష్ణవేణి మిక్కిలి నిరసనగా మాట్లాడడం వొకటీ, "మనకంటే పెళ్ళామే మంచిదనుకుంటాడేమో తమ్ము'' డన్న యీర్ష్యవొకటీ అందు క్కారణాలు.

ఉడికిపోయింది దీంతో ఆమె.

వెంటనే రోషంగా అందుకుని "కట్నం మాట ఎత్తాటప్పటికి అగ్గిమీద గుగ్గిలం అయిపోయింది చూశావా నీకోడలు?" అందామె తల్లితో, కళ్ళు తిప్పకుంటూనూ, కంఠం నొక్కుకుంటూనూ.

"పోనీలేవే" అంది మహాలక్ష్మమ్మ.

"బి.ఏ. చదివినా, అబ్బాయి కనపడేటప్పటికి లేచివెళ్ళి కోటందుకుంది. ఇదెక్కువా, పాడుకట్నం ఎక్కువా?" అనిన్నీ అడిగిందామె.

"పాడుకట్నం అనుకోకపోతే, నీచేతకానితనం అనుకోరాదూ?"

"చేతకానితనం యేం వుందే యిందులోనూ?"

"కట్నం విలవ నీకేం తెలుసునూ? ఎక్కడో చచ్చుజల్లి సీమలో పుట్టి దారితప్పి మా కోనసీమలో పడ్డావు"

"నీ కోనసీమా నువ్వూ — పోదూ నేర్చుకుపోయావ్"

"అలాగే పోతాను, తొందరపడకోయ్!"

"ఏమిటే నువ్వు చేసేది?"

"డబ్బంటే అంత చేదుగా వుందా నీకు? కనీసం వెయ్యిన్నూటపదహార్లయినా కట్నం లాగనందుకు మా సీమవాళ్ళు నన్నెంత పీకేస్తున్నారో, తమ్ముడెంత సిగ్గుపడిపోతున్నాడో—"

"సిగ్గెందుకూ, ఇష్టపడి చేసుకున్నాకా?"

"ఇష్టపడ్డాం, ఇష్టపడ్డాం— ఆ యిష్టం ఎలాంటిదో తెలుస్తుంది తొందరపడకు"

"ఏమి చెయ్యతలచుకున్నావే నువ్వు?"

"చూస్తూ వుండు నీకే తెలుస్తుంది"

మాట పూర్తి అయాటప్పటికి సబ్బూ తువ్వాలూ పుచ్చుకుని ముందు కృష్ణవేణి యివతలకి వచ్చింది.

ఏకాయెకీని శాస్త్రి నూతికి వెళ్ళాడు.

ఒక్క క్షణం గదిగుమ్మంలోనే నుంచుని వుండి, తరవాత వెనకాలే వెళ్ళింది కృష్ణవేణి.

కనపడ్డంతసేపూ రాజమ్మ కృష్ణవేణికేసే చూసింది, మట మట లాడుకుంటూ.

కాని "మామ్మో, మాతల్లో, కొంచెం ఆలస్యం అయినా చివరికి రత్నం దొరికింది నాకొడుక్కి" అంటూ మహాలక్ష్మమ్మ చాలా సంబరపడింది.

ఇది విని రాజమ్మ సహించ లేకపోయింది.

"అవిడగారు రత్నమాణిక్యమే, కాదని యెవ రన్నారూః అయితే, ఆరత్నం తాపడం చేసుకోడానికి కివతల తగినంత బంగారం వుండవద్దూః" అంటూ రుంజుకుంది, తల్లి బుగ్గలు పొడిచినంతపనిచేసి.

## 10

అప్పుడే భోజనా లయినాయి, కృష్ణవేణీ, రాధమ్మా, యాజులూ తాంబూలం వేసుకుంటూ మేడమీద కూచున్నారు.

"ఏమే అమ్మాయీ, ఆ దొప్పెడు అద్దెకొంపలోనూ ఇంకెన్నా ళ్ళిబ్బంది పడతావేః మనకి రెండు మేడ లున్నాయి గదా, మీరుకూడా వూరుకునే వున్నా రేమిటండీః" అంది రాధమ్మ, అటు కృష్ణవేణినీ ఇటు యాజుల్నీ చూస్తూ.

"విన్నావాః" అన్నట్టు తండ్రి తనకేసి చూడగా కృష్ణవేణి మందహాసం చేసింది.

"అమ్మాయి చెయ్యమన్నది నే నెప్పు డయినా కాదన్నా నేమో అడుగు" అన్నాడు యాజులు.

"అది చెయ్యమనాలా, పనికట్టుకునిః"

"పోనీ, ప్రయత్నపూర్వకంగా వొద్దంటేనో అదిః"

తెల్లబోయింది రాధమ్మ.

"అంటేః" అనడిగింది, వొక్క క్షణం వుండి.

"బాగా జ్ఞాపకం చేసుకో. చదువు చాలించుకుని అమ్మాయి ఇంటికి వచ్చి న్నాడే 'ఇదిగో, ఈ చరస్థిరాస్తులన్నీ నీవి' అని దాని కిచ్చేశాను. నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో అనిన్నీ చెప్పాను."

"చెబితేః"

"నీకిప్పటి కయినా జ్ఞాపకం రాలేదుటే అమ్మాః"

"ఏమి జరిగిందో నువ్వే చెప్పు."

"ప్రస్తుతం నెలకి రెండువందల యాభై రూపాయలు చొప్పున ఇస్తూ వుండమన్నాను."

"అవును."

"నాన్నా రిస్తున్నారు."

"అవి చాలక నా దగ్గిర నెలకి నూరు రూపాయలు పుచ్చుకుంటోంది, తెలుసా మీకుః" అనడిగింది, పురపుర చూస్తూ, రాధమ్మ భర్తని.

"ఎప్పణ్ణుంచని అడగండి నాన్నారూ" అంది కృష్ణవేణి.

"నీకు పెళ్ళయినప్పణ్ణుంచీనీ. నేనే చెబుతున్నాను మీ నాన్నా రడిగే దేమిటి?"

"నువ్వే ఇస్తున్నావు, నువ్వే చెబుతున్నావు, మరి, నాన్నారిమీద ఏదో నెపం వేస్తా వెందుకూ?"

"నెపం ఏముందే ఇందులోనూ? ఇదంతా ఏమి చేసుకుంటామే మేము?"

"ఇదంతా నాకిచ్చేశారుగా నాన్నారూ?"

"ఇచ్చి?"

"అంతా చూస్తున్నారు. నేను చూసిపెట్ట మన్నాను."

రాధమ్మ మాట్టాడలేకపోయింది.

యాజులు మందహాసం చేశాడు, రెప్పవెయ్యకుండా చూస్తూ.

తానున్నూ చూసిచూసి "పోనీ, ఇక ముందుమాట చెప్పు" అంది రాధమ్మ.

"అదే చెప్పబోతున్నాను. వారిదగ్గిర సోమరితనం కనబడుతోంది కొంచెం. అంత చిన్న వయస్సులో వుండవలసింది కాదిది. దర్జా కావాలి మళ్ళీ; కాని అందుకు తగ్గ పరిస్థితులు కల్పించుకోవా లన్న చూపు కనబడదు. పైగా, మా ఆడ బడుచు ధోరణి అదో మోస్తరుగా వుంటోంది. "వారు స్వతంత్రులా ఆవిడచేతిలో వున్నారా" అని నాకనుమానం. "సాలుకి రెండు వందలే తమకి వస్తాయని రాశారు వారు జ్ఞాపకం వుందా? ఆ రాబడి ఆవిడ ఆస్తిమీద నేమో తెలుసుకోవాలి. అడగడానికి వీల్లేని సంగతి ఇది. దాని కదే తేలుతుంది, సందేహం లేదు."

"కనక?"

"ఒక్క సంవత్సరం పూర్తి కానియ్యి."

"ఇంకా సంవత్సరమా?"

"కాదు, సంకురాత్రి వెళ్ళే దాకాను,"

"సంకురాత్రి — వెళ్ళే — దాకానే?" అంటూ సోఫాకి చేరబడి పోయింది రాధమ్మ.

"ఇంకెన్నాళ్ళుందే సంకురాత్రి?"

"ఇది ఫాల్గునమాసమేగా?"

"అవును."

"ఇంకా పదినెల్లా?"

"పదినెల్లంటే ఏమంత ఎక్కువమ్మా? నాన్నారు గుమాస్తాగా వున్నప్పుడు నువ్వెన్నేళ్ళు ఇబ్బందిపడ్డావో — "

